క్లుప్తంగా

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

నూజివీడు: లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న పట్టణంలోని తిరువూరు బస్టాప్ సెంటర్ సమీపంలోని చిన్న మసీదు దగ్గర ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. విజయవాడ సెంటినీ ఆస్పత్రికి చెందిన వైద్యులు ఈ వైద్యశిబిరంలో పాల్గొని పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు నిర్వహించే ఈ ఉచిత శిబిరంలో బీపీ, సుగర్, గుండె, మెదడు, వెన్నెముక, నరాలు, ఎముకలు, జీర్ణకోశ, మూత్రపిండాలు, మూత్రకోశ, ఊపిరితిత్తులు, స్త్రీల సంబంధిత, అన్ని రకాల సాధారణ వ్యాధులకు సంబంధించి పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు అందిస్తారని తెలిపారు.

నేడు ఎస్పీ బాలుకు స్వరార్చన

నూజివీడు: గాన గంధర్వుడు దివంగత ఎస్పీ బాలసుబ్రహ్మణ్యానికి ఆదివారం స్థానిక బ్యాంకు స్ట్రీట్ సమీపంలో ఉన్న సిద్ధార్థ జూనియర్ కళాశాలలో స్వరార్చన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నూజివీడు కళావేదిక నిర్వాహకులు పురాణం కృష్ణప్రసాద్ శనివారం తెలిపారు. నూజివీడు కళావేదిక, శ్రీ సత్య నృత్య సంగీత కళాశాల, రాగసుధా మెలోడీస్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం 5.30 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో ఎస్పీ బాలు అభిమానులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించాలని విజ్ఞప్తి చేశారు.

26న ఆగిరిపల్లిలో జాబ్‌మేళా

నూజివీడు(ఆగిరిపల్లి): ఆగిరిపల్లిలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 26న జాబ్‌మేళాను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పీ శంకర్ రావు శనివారం తెలిపారు. ఎన్‌టీసీఎఫ్‌డీసీ, ఎన్ఎస్ఎఫ్‌డీసీ సౌజన్యంతో ఉదయం 11గంటలకు నిర్వహించే ఈ జాబ్‌మేళాలో ఎంపికైన 30 మంది యువతకు ముందుగా భారత ప్రభుత్వ సంస్థ సీపెట్ విజయవాడ కేంద్రంలో మెషీన్ ఆపరేటర్ ప్లాస్టిక్స్ ప్రాసెసింగ్ టెక్నికల్ కోర్సులో ఉచిత శిక్షణను ఇస్తారని పేర్కొన్నారు. అనంతరం వారికి సర్టిఫికెట్‌తో పాటు అనంతపురం, హైదరాబాద్, బెంగళూరు, హోసూర్, చెన్నై ప్రాంతాలలోని ప్రముఖ ప్లాస్టిక్స్ అనుబంధ సంస్థలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలను కల్పిస్తుందని పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణత కలిగి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసు గల నిరుద్యోగులు తమ విద్యార్హత (ఒరిజినల్) సర్టిఫికెట్లను, కులం, ఆదాయ ధ్రువీకరణపత్రాలు, ఆధార్, రేషన్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలతో జాబ్ మేళాకు హాజరు కావాలని తెలిపారు. వివరాలకు సాకిరి రామకృష్ణ, ఫోన్ నంబరు 93985 35697లో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు రమణక్కపేట విద్యార్థినులు



ముసునూరు: రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు రమణక్కపేట హైస్కూల్‌కు చెందిన నలుగురు విద్యార్థినులు ఎంపికయ్యారని హెచ్ఎం పీవీఎస్ రామకృష్ణ తెలిపారు. ఇటీవల నూజివీడులో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో విద్యార్థినులు అండర్-14 విభాగంలో నాగసుధ, స్వాతి జయశ్రీ, అండర్-17 విభాగంలో కీర్తన, తేజశ్రీ, పరిమళ ప్రతిభ కనపర్చి, అవిభక్త కృష్ణా జిల్లా బాస్కెట్‌బాల్ తుది జట్టులో స్థానం సాధించినట్లు తెలిపారు. త్వరలో జరుగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టు తరపున వీరు పాల్గొంటారని తెలిపారు. శనివారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపికైన విద్యార్థినులను, శిక్షణనిచ్చిన పీఈటీ వాకా నాగరాజును అభినందించారు.

ఆరోగ్య సురక్ష సర్వే

తిరువూరు: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం కింద పట్టణంలోని పలు వార్డుల్లో శనివారం వైద్యారోగ్య సిబ్బంది సర్వే నిర్వహించారు. జ్వరపీడితులు, దీర్ఘకాలిక రోగుల వివరాలను సేకరించి ఆన్‌లైన్లో నమోదు చేశారు. రోజుల తరబడి జ్వరం తగ్గకపోతే సమీప ఆరోగ్య కేంద్రంలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వాస్పత్రిలో ఉచిత వైద్యసేవలందుతాయని సిబ్బంది సూచించారు.

ప్రకటన

[illegible]

తిరువూరు ది.23-09-2023 — చింతల వెంకటరెడ్డి, అడ్వకేట్, తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా. సెల్: 9440754148

చెరువు అభివృద్ధికి పక్కా ప్రణాళిక

- ఏడు శతాబ్దాల చరిత్ర కలిగిన గజపతి చెరువు
- వాకింగ్‌ట్రాక్, గ్రీనరీ, ఓపెన్ జిమ్ ఏర్పాటు
- రూ.1.45 కోట్లు మంజూరు



కొండపల్లిలో ఏడు శతాబ్దాల చారిత్రక నేపథ్యం కలిగిన గజపతి (గజరాజ) చెరువు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో శతాబ్దాల చరిత్ర కలిగిన గజపతి (గజరాజ) చెరువుకు మహర్దశ పట్టనుంది. ఏళ్ల తరబడి నిర్వీర్యంగా మారిన చెరువును అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సూచనలతో ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. అమృత్‌సర్ 2.0 పథకంలో కేంద్రం, ఏపీ రాష్ట్ర అర్బన్ గ్రీనరీ బ్యూటిఫికేషన్ సంస్థలు సంయుక్తంగా చెరువు అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందుకు అవసరమైన రూ.1.45కోట్లకు అధికారులు అంచనాలు రూపొందించారు. ఇవి కాకుండా 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి ఓపెన్ జిమ్ ఏర్పాటుకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. 700 ఏళ్ల చరిత్ర కలిగిన చెరువు అభివృద్ధి జరిగితే కొండపల్లి పట్టణానికి తలమానికంగా మారుతుంది.

మారనున్న చెరువు రూపరేఖలు

30వ నంబర్ జాతీయ రహదారి పక్కన నగరం నడిబొడ్డున సుమారు 32 ఎకరాల విస్తీర్ణంలో గజపతి చెరువు ఉంది. సమీపంలోని కొండలపై నుంచి వచ్చే వర్షపు నీటితో ఏడాది పొడవునా నీరు ఉంటుంది. ఇప్పటి వరకు నిరుపయోగంగా ఉన్న చెరువలో ప్రణాళిక మేరకు నీటిని శుద్ధిచేయడం, ఆరోగ్య ప్రయోజనాలకు వాకింగ్‌ట్రాక్ నిర్మాణం, భద్రతకు చెరువుచుట్టూ ఫెన్సింగ్, ఆహ్లాదాన్నిచ్చే గ్రీనరీతో పార్క్, పచ్చదనం కోసం మొక్కలు నాటడం, ఆరోగ్యాన్నిచ్చే ఓపెన్ జిమ్, చిన్నారుల ప్లే మెటీరియల్ ఏర్పాటు కానున్నాయి. చెరువుచుట్టూ వాకింగ్‌ట్రాక్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. పూర్తిస్థాయి అభివృద్ధి జరిగితే విద్యార్థులు, యువతీ యువకులు, వృద్ధులు, మహిళలకు ఆహ్లాదాన్ని ఇస్తుంది.

చరిత్రకు ఆనవాళ్లుగా గజపతి చెరువు

గజపతి చెరువు చరిత్రకు ఆనవాళ్లుగా నిలుస్తుంది. కొండపల్లి ఖిల్లాకు ఉన్న చరిత్ర ఈ చెరువుకు సైతం ఉంటుందని పురప్రజలు చెబుతారు. క్రీస్తుపూర్వం 14వ శతాబ్దం మధ్య కాలంలో కృష్ణానది ప్రాంతం కొండపల్లి ఖిల్లాను స్థావరంగా చేసుకుని పరిపాలన సాగించిన కపిలేశ్వర గజపతిరాజు తన కుమారుడైన విద్యాధర గజపతి పేరుతో విజయవాడ సమీపంలో విద్యాధరపురం, కొండపల్లిలో విద్యాధర గజపతి చెరువును ఏర్పాటు చేసినట్లు చెబుతారు. వర్షాభావ పరిస్థితులను తట్టుకునేందుకు చెరువులో నీటిని నిల్వ చేశారు. చెరువులో మరో బావిని తవ్వించినట్లు చెబుతారు. పూర్వం అనేక గ్రామాలు, వివిధ వర్ణాల వారు తరతరాలుగా తాగునీరుగా చెరువు, బావి నీటిని వాడేవారు.



కొండపల్లిలో చెరువు పక్కన వాకింగ్ ట్రాక్‌ను చదును చేస్తున్న పొక్లెయినర్, జేసీబీ

అనంతరం విద్యాధర గజపతికి పైడమ్మ, ముత్యాలమ్మ అనే ఇద్దరు కుమార్తెలు ఉండగా. వారి పేర్లతో కొండపల్లి సమీపంలో పైడూరుపాడు, ముత్యాలంపాడు గ్రామాలు నిర్మించినట్లు చరిత్రలో ఉంది.

చెరువును కొండపల్లికి తలమానికంగా చేస్తాం



శతాబ్దాల చరిత్ర కలిగిన గజరాపతి చెరువును పూర్తిగా ప్రక్షాళన చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నాం. రాష్ట్ర గ్రీనరీ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ నుంచి రూ.1.45 కోట్లు మంజూరయ్యాయి. గజరాజ చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి కొండపల్లి మున్సిపాలిటీకి తలమానికంగా మారుస్తాం.

– పోలగంగు రాణి, గ్రీనరీ బ్యూటిఫికేషన్ రాష్ట్ర డైరెక్టర్

వినియోగదారులు తమ హక్కులను తెలుసుకోవాలి



సదస్సులో పాల్గొన్న జడ్జి చిరంజీవి, అడ్వొకేట్ అయ్యప్ప తదితరులు

మైలవరం: వినియోగదారులు తమ హక్కులను తెలుసుకుని, మోసాల నుంచి రక్షణ పొందాలని వినియోగదారుల కమిషన్-2 అధ్యక్షుడు, జడ్జి ఎస్.చిరంజీవి తెలిపారు. మైలవరం ఎస్ఎస్‌కే హైస్కూల్‌లో హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంపై శనివారం అవగాహన సదస్సు జరిగింది. జడ్జి చిరంజీవి మాట్లాడుతూ వినియోగదారులు ప్రతి ఒక్క వస్తువు తీసుకునేటపుడు రసీదును తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. మానవ హక్కులు, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, సమాచార హక్కు చట్టం, పోక్సో చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం జడ్జి చిరంజీవిని శాలువతో సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా వినియోగదారుల కమిషన్ మెంబర్ రమణ, హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ బి. దాసు, ఏపీ హైకోర్టు అడ్వొకేట్ బరిగే అయ్యప్ప, ఎస్ఎస్‌కే హైస్కూల్ ప్రిన్సిపాల్ జాన్ పాల్గొన్నారు.

కృష్ణావాటర్ సరఫరా నిలిపివేత

జి.కొండూరు: పైపులైన్ మరమత్తుల కారణంగా జి.కొండూరు, మైలవరం మండలాలకు ఆదివారం నుంచి రెండు రోజులపాటు కృష్ణావాటర్‌ను నిలిపివేస్తున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ దయానంద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ రెండు మండలాల పరిధిలోని ప్రజలు తాగునీటి కోసం ప్రత్యామ్నాయ మార్గాలను ఎంచుకోవాలని పేర్కొన్నారు.

జాబ్‌మేళాలో 15 మంది ఎంపిక

ముసునూరు: మండలంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిర్వహించిన జాబ్ మేళాలో 15 మంది అభ్యర్థులు ఎంపికైనట్లు ఎంపీడీఓ జి.రాణి తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన జాబ్ మేళాకు 10వ తరగతి ఉత్తీర్ణులైన, 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసుగల అర్హులైన ఎస్సీ, ఓబీసీ అభ్యర్థులు 25 మంది హాజరయ్యారన్నారు. వీరిలో ఎస్సీ అభ్యర్థులు 10 మంది, ఓబీసీ అభ్యర్థులు ఐదుగురు, మొత్తం 15 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన వారికి విజయవాడలోని భారత ప్రభుత్వ సంస్థ సీపీఈటీ కేంద్రంలో మెషీన్ ఆపరేటరేటింగ్, ప్లాస్టిక్ ప్రాసెసింగ్‌లో శిక్షణనిస్తామని ఆర్గనైజర్ సాకిరి రామకృష్ణ అవగాహన కల్పించారు. శిక్షణానంతరం చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, అనంతపురం తదితర ప్రాంతాల్లోని సంస్థల్లో ఉద్యోగాలు కల్పిస్తామని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి కల్యాణం



తిరువూరు రాజుపేటలో గణపతికి పూజలు



తిరువూరు బోస్ సెంటర్లో గణపతి కల్యాణం

తిరువూరు: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా తిరువూరులోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన నవరాత్రి పందిళ్లలో శనివారం సిద్ధి బుద్ధి సమేత గణపతి కల్యాణాన్ని నిర్వహించారు. బోస్ సెంటర్‌లోని పందిరిలో జరిగిన కల్యాణవేడుకలో పలువురు దంపతులు పాల్గొని కన్యాదానం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. భూమావారి వీధిలోని గణపతి నవరాత్రి వేడుకల్లో కుంకుమపూజలు, రాజుపేట ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో స్వామికి అష్టోత్తర శతనామావళితో పూజలు జరిగాయి.

గణనాథుడికి ప్రత్యేక పూజలు

మైలవరం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మైలవరంలో ఏర్పాటు చేసిన గణనాథుడికి ఉత్సవ కమిటీల ఆహ్వానం మేరకు వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులకు విరాళాలు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆ దేవదేవుడు వినాయకుని చల్లని ఆశీస్సులు ఎమ్మెల్యేకు నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ ఉండాలని కోరుకున్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: స్థానిక కాపుల బజారులో శనివారం నిర్వహించిన వినాయక చవితి వేడుకల్లో జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి పాల్గొని పూజ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొలగాని తిరుపతిరావు, నాయకులు కుప్పిరెడ్డి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ రాబర్టు, ఎంపీటీసీ సభ్యుడు వరప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేష్ నిమజ్జనం

చాట్రాయి: గణపతి నవరాత్రులు సందర్భంగా మండలంలోని చనుబండ కోనేరు అభయాంజనేయ స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని శనివారం ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు అన్నదానం చేశారు.

ముసునూరులో..

ముసునూరు: మండలంలోని ఆయా గ్రామాల ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో మండపాలలో ఏర్పాటు చేసిన గణనాథుల ప్రతిమలను శుక్ర, శనివారాల్లో ఊరేగించి సమీప కాలువల్లో నిమజ్జనం చేశారు. లోపూడి సర్పంచ్ పేరం కృష్ణ ఆధ్వర్యంలో రైస్ మిల్లు, సగరవాడ, యాదవ బజార్లలోనూ, చెక్కపల్లి సగరవాడ తదితర ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం తమ్మిలేరు చెక్ డ్యామ్, స్థానిక చెరువుల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.



మైలవరంలో వినాయకుడికి పూజలు నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు



రెడ్డిగూడెంలో వినాయక పూజలో జెడ్పీటీసీ సభ్యుడు పాలంకి తదితరులు



చనుబండలో వినాయకుడి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



తమ్మిలేరు చెక్‌డ్యామ్ వద్ద గణనాథుడి నిమజ్జనం

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలని అసిస్టెంట్ సీడీపీఓ డి.జోత్స్న సూచించారు. స్థానిక 30వ డివిజన్ కేఎల్‌రావునగర్ అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఆమె గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. పోషకాహారం తీసుకుంటే కలిగే ప్రయోజనాలు తెలియజేశారు. అంగన్‌వాడీ సెంటర్ సేవలను వినియోగించుకోవాలని అతి తక్కువ ఖర్చుతోనే మంచి పోషక విలువలను ఎలా పొందవచ్చో వివరించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ వి.విజయ అంగన్‌వాడీ కేంద్రాల్లో లభించే సేవలను తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు లత, రమణమ్మ అతి తక్కువ ఖర్చుతోనే మంచి పోషకవిలువలతో ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవచ్చో ప్రయోగాత్మకంగా పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కరరెడ్డి

రెడ్డిగూడెం: ప్రజల సమస్యలను పరిష్కారించుకుంటూ.. మీకు ఏమైన సందేహాలు ఉంటే పై అధికారులకు, ప్రజా ప్రతినిధులకు తెలియజేస్తూ పరిష్కరించేందుకు కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ సెక్రటరీ, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్‌తో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలకు అనుగుణంగా మన ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల్లో రెడ్డిగూడెం మండలాన్ని ముందుకు తీసుకెళుతున్నారన్నారు. ఎంపీడీఓ బి.విష్ణు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఈఓపీఆర్డీ బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు రవికుమార్, మీరాసాహెబ్, శివరంగారావు, వీరస్వామినాయుడు పాల్గొన్నారు.

అవయవ దానంపై చైతన్యం రావాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): అవయవ దానంపై సమాజం చైతన్యవంతం కావాల్సిన అవసరముందని ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యాన అవయవదానం, రక్తదానంపై అవగాహన సదస్సును ఆ కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించారు. సుహాసిని మాట్లాడుతూ అవగాహన లోపం కారణంగా ప్రపంచంలో విలువైన అవయవాలు బూడిదపాలవుతున్నాయన్నారు. ప్రిన్సిపాల్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ఎం.వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల గడప వద్దకు పాలనను తీసుకొచ్చిన సీఎం

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



కృష్ణవరంలో సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



కొమ్ముర్రులో సిమెంట్ రోడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు

నూజివీడు(ఆగిరిపల్లి): గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పాలనను ప్రజల గడప వద్దకు తీసుకొచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే మేకా వెంకటప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలంలోని కృష్ణవరంలో రూ.60 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని, రైతుభరోసా కేంద్రం భవనాన్ని, కొమ్మ్మురులో నిర్మించిన సిమెంట్ రోడ్లను శనివారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్ ప్రజల గుండెల్లో ఉన్నారని, రాబోయే ఎన్నికల్లోనూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ప్రజల సంక్షేమం కోసం నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నన్ని సంక్షేమ పథకాలు దేశంలో మరే రాష్ట్రంలోనూ లేవన్నారు. ఒకవైపు సంక్షేమాన్ని కొనసాగిస్తూ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, రైతు భరోసా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. పీహెచ్‌సీలను అభివృద్ధి చేయడమే కాకుండా గ్రామగ్రామాన ఏర్పాటు చేసిన వెల్‌నెస్ కేంద్రాల్లో వంద రకాల మందులను, 14 రకాల టెస్టులను ప్రజలకు అందుబాటులో ఉంచిందన్నారు. త్వరలోనే సాగర్ జలాలను సరఫరా చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కృష్ణవరం, సిద్ధార్థనగర్, కొర్లగుంటలలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. 2014 నుంచి 2019వరకు చంద్రబాబు ప్రభుత్వం దోచుకోవడం, దాచుకోవడం తప్ప చేసిందేమీ లేదన్నారు. టీడీపీని నమ్ముకుంటే రాష్ట్రం అధోగతేనని దుయ్యబట్టారు. ప్రజలందరూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏపీ స్టేట్ కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, తహసీల్దార్ ఉదయభాస్కర్, జెడ్పీటీసీ సభ్యుడు వీరబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మచ్చా హరిబాబు, ఉపాధ్యక్షురాలు తులిమెల్లి సుజనకుమారి, మండల అధ్యక్షులు పలగాని నరసింహారావు, వైస్ ఎంపీపీ గడ్డం సాంబశివరావు, కొండవరదల రమేష్, సర్పంచ్ జ్యోతి, కొమ్మ్మురు సర్పంచ్ కె.ఏసు, ఎంపీటీసీ సభ్యుడు కోటేశ్వరరావు, నాయకులు కనకయ్య, రాంబాబు, శ్రీను, వెంకట సుబ్బయ్య, ఇస్సాకు, కే దిలీప్‌కుమార్, సక్కేశ్వర రావు, భాస్కరప్రసాద్ పాల్గొన్నారు.

150 మంది ఉద్యోగాలకు ఎంపిక



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉద్యోగార్హత పొందిన విద్యార్థులు

మైలవరం: కళాశాలల్లో నిర్వహించే జాబ్ మేళాల వలన గ్రామీణ ప్రాంత యువతకు ఎంతో మేలు జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జేకేసీ, ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మెగా జాబ్ మేళా కార్యక్రమం జరిగింది. జాబ్ మేళాలో 24 ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగ యువతను ఇంటర్వ్యూ చేశారు. వివిధ గ్రామాల నుంచి 414 మంది యువత హాజరయ్యారు. తొలి విడతగా 150 మంది యువత ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 104 మందిని తరువాత ముఖాముఖిలు నిర్వహించి ఎంపిక చేస్తారని ప్రిన్సిపాల్ డాక్టర్ రవి తెలిపారు. కార్యక్రమంలో డి. శ్రీనివాసరావు, కళాశాల సీడీసీ సభ్యుడు జడ్. నాగిరెడ్డి, ఎన్టీఆర్ జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ అధికారులు నరేష్, మోహన్, చరణ్, అశోక్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు పుట్రేల విద్యార్థులు



జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

విస్సన్నపేట: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో గంపలగూడెంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి పుట్రేల జెడ్పీ హైస్కూలు విద్యార్థులు 22 మంది జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం జి.సౌభాగ్యం శనివారం తెలిపారు. కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ విభాగాల్లో తమ పాఠశాలకు చెందిన 22 మంది బాల, బాలికలు ఎంపికయ్యారని హెచ్ఎం తెలిపారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన వ్యాయామోపాధ్యాయుడు సీహెచ్ కొండలరావును ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం అభినందించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



తిరువూరులో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ బాలకృష్ణ

తిరువూరు: తిరువూరు పట్టణంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నగరపంచాయతీ కమిషనర్ బాలకృష్ణ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని పలు వార్డుల్లో పారిశుద్ధ్య సమస్యను శనివారం పరిశీలించిన కమిషనర్ సిబ్బందికి సూచనలిచ్చారు. రోడ్లపై చెత్తాచెదారం పోయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, మురుగునీటి పారుదలకు కచ్చా డ్రెయిన్లు నిర్మించాలని సిబ్బందికి సూచించారు. రక్షిత మంచినీటి క్లోరినేషన్, పైపులైన్ల లీకేజీ అరికట్టడంలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. దోమల నివారణకు మలాథియాన్, ఎబేట్ పిచికారీ చేయాలని తెలిపారు.

అగ్గితెగులును నివారించండి



వరి పైరును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

చాట్రాయి: వరి పైరుపై అగ్గి తెగులు ఎక్కువగా కనిపిస్తోందని వ్యవసాయ అధికారి బి శివశంకర్ తెలిపారు. చాట్రాయిలో వరి పైరుకి ఆశించిన అగ్గి తెగులును శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్గి తెగులు నివారణకు గ్రాము కార్బెండిజమ్‌ని లీటరు నీటిలో కలిపి ఎకరానికి 150 నుంచి 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి రైతు తమ పంటలను ఈకేవైసీ చేయించుకోవాలని ఆయన కోరారు.